

# జవాబు చెప్పలేదు

అంగర వెంకట కృష్ణారావు

"పెళ్ళి చూపులకొస్తున్నారు. వాళ్ళు చాల భాగ్యవంతులు. అమ్మాయిని చూసుకొని వెళ్ళిపోతారు. పావుగంటుంటారు. ఈ పావుగంటలో వాళ్ళకి తగిన మర్యాదచేసి పంపెయ్యాలి." ప్లీడరుగారు చెప్పి కచేరీగదిలో కి వెళ్ళిపోతున్నారు.

"సమయానికి కోడలేదు, అనుకున్న ప్రకారం యివాళ మెయిల్లో ఆవిడగారు దిగితే, నాకొంత బరువు తగ్గుతుంది" ప్లీడరు గారి భార్య అంది.

"పెద్దబ్బాయ్! నువ్వివాళ అఫీసుకు సెలవు పెట్టేవా? మెయిలుకెళ్ళి మీ అక్కణ్ణి తీసుకురా." ప్లీడరు గారు.

పెద్దబ్బాయ్ అలాగే అన్నాడు.

"ఫలహారానికి యేమిటి చేయిస్తే బాగుంటుంది? అబ్బాయ్ తల్లి అబ్బాయి తండ్రి నడిగింది.

"అదంతా నీ డిపార్టుమెంటు ..."

"సరే. మైసూర్ పాక్, బజ్జీ చేయిస్తా ..."

పెళ్ళి చూపులవగానే యింటికి పెళ్ళి కళ, బూరెల వాసన అప్పుడే వచేసింది.

"పిన్నమ్మోయ్‌గోరో! పెల్లయి. అత్తోరింటికెలిపోతే, నన్ను మరిచిపోతావా?" పనిమనిషి అప్పలమ్మ సరదాగా అడిగింది.

విరబోసిన తల ఆరబెట్టుకుంటూ పెళ్ళికూతురు నవ్వింది.

"నిన్నెలా మర్చిపోతానే అప్పలమ్మ. నీ కేక మా అత్తారూరిదాకా వినిపిస్తుంది."

పెళ్లికూతురు చదువు ముగించి నాలుగేళ్లైంది. ఆమె ఉద్యోగం చెయ్యటం తల్లి కిష్టంలేదు. తండ్రి సమ్మంధాల కోసం గాలిస్తున్నాడు. అందరూ ఆలస్యమైపోతూందంటున్నారు.

"బాబూ! అమ్మాయిగారికి త్వరగా పెళ్లిచేసేయటం మంచిది." ప్లీడరుగారి గుమస్తా ఓనాడు కళ్లజోడునుంచి చూస్తూ సలహా యిచ్చేడు.

"అలా వెధవ సలహాలివ్వకపోతే, ఓ మంచి సమ్మంధం వెతికి పెట్టరాదూ? పిల్లవివాహం అంటే ఏమిటి? తోటకూర బేరమను కున్నావా ... ..."

"అమ్మమ్మా ... యెంతమాట! మనమ్మాయి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెకి బాగా చదువున్న వారు, మంచి సంప్రదాయం గలవారూ. అందం చందం గలవారే భర్తవుతారు. నాకు తెలుసు. అమ్మాయి జాతకం నేనె రాశానుకదా ..." గుమస్తా.

"ఏమయ్యోయ్! కొంచెం ఒంటిమీద తెలివుంచుకుని మరీ చెయ్యి మైసూర్ పాక్. లేకపోతే నాకు బదులు అదే పరిగెడుతుంది గుమ్మందాకా పెళ్లివార్నెదుర్కొడానికి." ప్లీడరు గారి భార్య వంటాయన్ని హెచ్చరించింది.

"అమ్మమ్మా! ఎంతమాట! వచ్చేది వియ్యాల వారంటే నాకు మాత్రం తెలీదా? నా చేతి మైసూర్ పాక్ ఇవాళ రుచిచూసి, మళ్లి పెళ్లిలో అదే చేయించమని వాళ్ళే ఉత్తరం రాయకపోతే. నా పేరు ..." వంటాయన పోపుకలుపుతున్న గరిట గదలా తిప్పేడు.

పెళ్లికూతురు మనస్సు పరవళ్లుతొక్కుతూంది. ఆయన యెలావుంటాడు? పొడుగ్గానా? తెల్లగానా? నవ్వితే బహుశా చంద్రుడిలా వుంటాడు.

ప్లీడరు గారు పదిన్నరకి కోర్టుకి వెళ్ళిపోయారు. తిరిగి మూడు కాకుండా వచ్చేస్తానన్నారు.

"అబ్బాయ్: మెయిలు టైమైందేమో" తల్లి.

"ఇంకా చాలా టైముందమ్మ. ఇప్పుడు పదకొండే అయింది. మెయిలు పన్నెండున్నరకొస్తుంది. ఇంతకీ నీ కోడలంత సంగనాచికాదు, సాయం లేకపోయినా చక్కారాగలదు."

మాటలోనే అఫీసునుంచి కబురొచ్చింది. అర్జంటు పనుంది. తిరిగి ఒంటిగంటకి వెళ్ళిపోవచ్చుని అధికారి కబురు పెట్టేడు.

"అమ్మా! నేను అర్జంటు పనిమీద అఫీసుకి వెళ్తున్నా. ఒంటిగంటకొచ్చేస్తా. వెంకన్నని మెయిలుకి పంపు."

అబ్బాయ్ అఫీసు కెళ్లేడు. వెంకన్న మెయిలు కెళ్లేడు.

"దండాలమ్మా ..."

పెద్ద కోడలు రైలు దిగింది.